
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 22.4





సభలో మాట్లాడుతున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు సామేలు, వేముల వీరేశం

పల్లె వెలుగులేవీ?



బస్సుల కొరత కారణంగా నల్లగొండ బస్టాండ్‌లో పల్లె వెలుగు బస్సులో కిక్కిరిసి ఎక్కుతున్న ప్రయాణికులు

- 70 రూట్లలో కనపడని బస్సులు
- ఉన్న బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణం
- అధిక లోడుతో మరమ్మతుకు గురవుతున్న వైనం
- బస్సులు, ఉద్యోగుల కొరతతో సమస్యలు
- రీజియన్ పరిధిలో ఏడు డిపోలు
- అన్ని డిపోల్లో ఇదే పరిస్థితి

నల్లగొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు బస్సులు, ఉద్యోగుల కొరత మరో వైపు వైపు మరమ్మతుకు గురవుతున్న బస్సులతో ఆర్టీసీ కొట్టుమిట్టాడుతోంది. ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పేరుతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించగా, సౌకర్యవంతమైన ప్రయాణం మాత్రం అందడంలేదు. బస్సులు సరిపడా లేక చాలా చోట్ల మహిళా ప్రయాణికులు పల్లె వెలుగు బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్‌ల కోసం బస్టాండ్లలో గంటల తరబడి వేచి ఉంటున్నారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌ల స్థానంలో పలు రూట్లలో మినీ డీలక్స్ బస్సులు నడుపుతున్నా, వీటిలో మహిళలకు ఉచిత ప్రయాణ అవకాశం లేదు. ఉచిత ప్రయాణం కల్పించి రద్దీకి అనుగుణంగా బస్సులు నడపటం లేదని మహిళలు వాపోతున్నారు. కొన్ని డిపోల్లో పల్లె వెలుగు బస్సులను బస్టాండ్‌కు పంపించి అవి నిండి వెళ్లాకే ఎక్స్‌ప్రెస్ బస్సులు పంపుతుండటంతో ఇవి ఆలస్యంగా నడుస్తున్నాయి. ఏదైనా స్టేజీ వద్ద మహిళలు అధికంగా కనిపిస్తే బస్సులు నిలపడం లేదనే ఆరోపణలూ ఉన్నాయి. వీటన్నింటికీ బస్సుల కొరతే కారణమైంది.

నల్లగొండ రీజియన్ పరిధిలో మొత్తం ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 27లక్షల మందికి పైగా మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యంతో లబ్ధి పొందారు. దేవరకొండ డిపో పరిధిలో 7.37లక్షల మంది, కోదాడలో 2.98లక్షల మంది, మిర్యాలగూడ డిపోలో 3.71లక్షలు, నల్లగొండలో 3.37లక్షల మందికి పైగా మహిళలు ఉచితంగా ప్రయాణించారు. నార్కట్‌పల్లి డిపో పరిధిలో 80వేలు, సూర్యాపేటలో 5.50లక్షలు, యాదగిరిగుట్ట డిపో పరిధిలో 3.77లక్షల మందికి పైగా మహిళ ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

వేధిస్తున్న బస్సులు, ఉద్యోగుల కొరత

ప్రస్తుతం ఆర్టీసీలో నియామకాలు లేకపోవడంతో పాటు కొత్త బస్సులు మంజూరు

మిగతా 5వ పేజీలో...

మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం



ఉమ్మడి నల్లగొండ జిల్లా రీజియన్ పరిధిలో ఉన్న ఏడు డిపోల నుంచి సరిపడా బస్సులను నడుపుతూ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. బస్సులను అన్ని రూట్లకు నడపడం వల్ల సంస్థకు ఆదాయం కూడా మెరుగైంది. ఆర్టీసీకి ఆదాయం పెంచేందుకు కోసం ప్రత్యేక సందర్భాల్లో, పండుగ సమయంలో బస్సులను పెంచుతున్నాం. వచ్చే నెలలో పంచారామ క్షేత్రాలు, అరుణాచలానికి బస్సులు నడపడం వల్ల ఆదాయం పెరుగుతుంది. రీజియన్‌లోని 35 రూట్లలో కొత్త గ్రామపంచాయతీలకు బస్సులు నడపాలని వినతిపత్రాలు వచ్చాయి. ఆ రూట్లలో కూడా త్వరలో బస్సులు నడుపుతాం. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళా ప్రయాణికులు ఉచితంగా ప్రయాణించడం వల్ల డ్రైవర్లు, కండక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విషయం మా దృష్టికి రాలేదు. మహిళా ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తాం.

● ఎం.రాజశేఖర్, రీజనల్ మేనేజర్ నల్లగొండ



నార్కట్‌పల్లి పీఏసీఎస్ కార్యాలయం

జీరో వడ్డీ వ్యాపారమెలా?

- అప్పుపై వడ్డీ పెంచుతూ మార్గదర్శకాల్లో సవరణ
- 7శాతం వడ్డీ తెచ్చి అంతే మొత్తానికి పంట రుణాలా?
- మార్జిన్ లేని వ్యాపారంతో తగ్గనున్న ఆదాయం
- వడ్డీ సవరణతో ప్రశ్నార్థకంగా మారిన పీఏసీఎస్‌ల మనుగడ

నార్కట్‌పల్లి, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): టెస్కాబ్ సవరించిన వడ్డీ మార్గదర్శకాలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)కు ఇబ్బందిగా మారింది. సవరించిన మార్గదర్శకాల మేరకు జీరో వడ్డీ వ్యాపారం చేయాల్సి వస్తే ఆదాయం తగ్గిపోయి సంఘాల మనుగడే ప్రశ్నార్థకంగా మారనుంది. అసలే అంతంత మాత్రంగా కొనసాగుతున్న పీఏసీఎస్‌ల ఆదాయ పరిస్థితి మరింత దిగజారనుంది. సవరించిన మార్గదర్శకాలతో మార్జిన్ (లాభం) లేని వ్యాపారాన్ని చేసేదెలా? సంఘాల ఆర్థిక పరపతి పెరగడమెలా? అనే ఆందోళనలో సహకార సంఘాల పాలకవర్గాలు ఉన్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణతో కొంత ఆదాయాన్ని పోగేసుకుంటూ సంఘాలు లాభాల బాట

మిగతా 4వ పేజీలో...

మూసీ ప్రక్షాళనకు మద్దతుగా

లక్ష మందితో బహిరంగ సభ

- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి
- బిక్కేరు లూటీ... మూసీ మురికి : ఎమ్మెల్యే మందుల సామేలు
- అందరూ బీఆర్ఎస్ నేతల్లా ఉండరు : ఎమ్మెల్యే వేముల వీరేశం

మోత్కూరు, అడ్డగూడూరు, శాలిగౌరారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన మూసీ ప్రక్షాళనకు మద్దతుగా అడ్డగూడూరు మండలం మానాయకుంట బ్రిడ్జి వద్ద శంఖం పూరించామని, ఈ అంశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు త్వరలో లక్ష మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఆధ్వర్యంలో ఆదివారం అడ్డగూడూరు మండలం మానాయకుంట మూసీ బ్రిడ్జి వద్ద నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ అభివృద్ధి, రాజధానితోపాటు, రంగారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు స్వచ్ఛమైన తాగు, సాగు నీరందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన మూసీ ప్రక్షాళనపై విషం కక్కుతున్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులను గ్రామాలకు రాకుండా ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మూసీ ప్రక్షాళన ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగు, సాగు నీరు అందడంతో పాటు పర్యాటకం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తనతో పాటు ముగ్గురు మంత్రులను, అధికారులను సియోల్ పంపించి అక్కడ మురికిగా ఉన్న నదులను ఎలా ప్రక్షాళన చేశారు, వాటితో కలుగుతున్న ప్రయోజనాలేంటో అధ్యయనం చేయించారన్నారు. మూసీ ప్రక్షాళన చేస్తే ఇక తమకు పుట్టగతులుండవని ప్రతిపక్షాలు మోకాలడ్డుతున్నాయన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లాల ప్రజల మనోభావాలు దెబ్బతినేలా ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు మద్దతుగా ప్రజలు గొంతు విప్పి అండగా నిలవాలన్నారు. గత ప్రభుత్వం రూ.7లక్షల కోట్లు అప్పు చేసి పోతే సీఎం రేవంత్‌రెడ్డి క్రమంగా నిధులు సమకూర్చుకుంటూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్నారని ఈ సందర్భంగా కొనియాడారు.

ఇసుకను లూటీచేసి మూసీని మురికిగా మార్చారు : ఎమ్మెల్యే సామేలు

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో బిక్కేరు నుంచి ఇసుకను లూటీ చేశారని, మూసీని మురికి కూపంగా మార్చారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు విమర్శించారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీ‌ష్‌రావులకు మూసీ ప్రక్షాళనను అడ్డుకున్నా ఆగేది లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయంలో మూసీ రివర్ బోర్డు పేరుతో రూ.25వేల కోట్లు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో బతికున్న పేదోడికి ఒక్క ఇల్లు కూడా నిర్మించకుండా, బొందల గడ్డలు, శ్మశానవాటికలు నిర్మించారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం వచ్చే నవంబరులో ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వనుందన్నారు. కాంగ్రెస్ పది నెలల పాలనలో నియోజకవర్గంలో పలు రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.50కోట్ల నిధులు, తిరుమలగిరికి ప్రభుత్వ జూనియర్ కళాశాల, రూ.300కోట్లతో ఇంటిగ్రేటెడ్

మిగతా 4వ పేజీలో...



వర్షాలతో తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలో నేలవాలిన వరిపంట (ఫైల్)

వర్షాలతో 5వేల ఎకరాల్లో పంట నష్టం

ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదిక

నల్లగొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు 5వేల ఎకరాలల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ ప్రాథమిక నివేదికను రూపొందించి ప్రభుత్వానికి పంపించింది. అయితే చాలా చోట్ల వరి చేలు నేలవాలాయి. వరి చేలు ఒరిగిన పంటకు పరిహారం వస్తుందా? రాదా? అనేది సందేహంగా మారింది. సాగర్ ఆయకట్టు ప్రాంతంలోని దామచర్ల, మిర్యాలగూడ, మాడ్గులపల్లి, హాలియా, నిడమనూరు, తిరుమలగిరి(సాగర్) ప్రాంతాలల్లో వరి పంట నేలవాలింది. వాస్తవానికి అయితే 33శాతానికి పైగా పంట దెబ్బతింటేనే ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుంది. అయితే వరి పంట నేలవాలితే నష్టం అంచనా వేయాలని ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు లేవు. అందుకు అనుగుణంగా ఆదేశాలు వస్తే వ్యవసాయశాఖ మరోసారి పూర్తి స్థాయిలో పంట సర్వే చేసే అవకాశాలు ఉన్నాయి.

కొనసాగుతున్న పైలట్ ప్రాజెక్టు సర్వే



వర్షాలతో తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలో నేలవాలిన వరిపంట (ఫైల్)

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ పైలట్ ప్రాజెక్టు సర్వేను అధికారులు ఆదివారం సెలవు దినమైనా నిర్వహించారు. జిల్లా ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ శాఖ ఏడీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శ్రీరాంపురం, కొనేటిపురం శివారులోని రైతుల భూముల్లో సర్వే కొనసాగింది. కోనేటిపురంలోని సర్వే నెం.99లో నిర్వహిస్తున్న సర్వేను ఏడీ శ్రీనివాస్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పైలట్ ప్రాజెక్టును వేగవంతం చేసే చర్యలో భాగంగా ఉన్నతాధికారుల సూచనల మేరకు సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా నేడు ఎల్లాపురం రెవెన్యూ శివారుకు సంబంధించి సర్వే నెం.2, 116, 124లో సర్వే నిర్వహిస్తామని, సంబంధిత రైతులు అందుబాటులో ఉండి అధికారులకు సహకరించాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుగోపాల్‌రెడ్డి, డీఐ రమణయ్య, సర్వేయర్లు నాగసాయి, వెంకటేశ్వర్లు, రైతులు ఉన్నారు.

పెళ్లయిన ఆరు నెలలకే మృత్యుఒడికి

- రెండు నెలల క్రితమే అక్క ఆత్మహత్య
- కుమార్తె మృతిపై అనుమానం ఉందని తండ్రి ఫిర్యాదు

5

ఆఫ్‌లైన్‌లో నాన్‌జ్యుడీషియరీ స్టాంప్ పేపర్లు

- అధిక ధరలకు విక్రయాలు
- దండుకుంటున్న స్టాంప్ వెండర్లు
- కొరవడ్డ అధికారుల పర్యవేక్షణ

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నాన్ జ్యుడీషియరీ బాండ్ల విక్రయాల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు స్టాంప్ వెండర్లు శాఖాపర నిబంధనలను అతిక్రమించి విక్రయాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు అక్రమార్కులు పాత డేట్లతో సేకరించిన స్టాంపులపై స్థిర, చరాస్తులను వివరాలు రాయించి భూవివాదాలకు దిగుతున్నారు. అయితే ఇలాంటి సంఘటనలను నియంత్రించేందుకు రిజిస్ట్రేషన్ శాఖ చర్యలు చేపట్టింది. డాక్యుమెంట్ వెండర్లు పొందిన నాన్ జ్యుడీషియల్ డాక్యుమెంట్ల నెంబర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్న నిబంధన విధించింది. అదేవిధంగా రోజువారీగా విక్రయించిన డాక్యుమెంట్ల వివరాలను సైతం ఆన్‌లైన్‌లో విధిగా పొందుపర్చాలి. కానీ, కొందరు డాక్యుమెంట్ వెండర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కార్యాలయంలోని కొందరు ఉద్యోగుల సహకారంతో అడ్డదారుల్లో బాండ్ పేపర్ల విక్రయాలు సాగిస్తున్నట్లుగా తెలుస్తోంది.



మాన్యువల్‌గా జారీ చేసిన నాన్ జ్యుడీషియరీ స్టాంప్

ఆన్‌లైన్ నమోదుకు మంగళం

డాక్యుమెంట్ వెండర్ల అక్రమాలను నియంత్రించేందుకు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్‌శాఖ పకడ్బందీగా చర్యలు చేపట్టింది. ఏడాదిన్నర క్రితం ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. అయితే అప్పటికే డాక్యుమెంట్ వెండర్ల వద్ద వివిధ ధరల స్టాంప్ పేపర్లు నిల్వ ఉన్నాయి. వాటన్నింటినీ సబంధిత కార్యాయలంలో సమర్పించాల్సి ఉండగా, కొందరు స్టాంప్ వెండర్లు సదరు స్టాంప్‌లను విక్రయించినట్లుగా రికార్డులో నమోదు చేశారు. తాజాగా, అమలులోకి తెచ్చిన ఆన్‌లైన్ విక్రయాల పోర్టల్‌లో సదరు స్టాంప్ వెండర్ వద్ద నోస్టాక్‌గా రిపోర్టు నమోదు చేశారు. కొందరు స్టాంప్ వెండర్లు వారు దాచుకున్న నాన్ జ్యుడీషియరీ స్టాంప్‌లను ప్రస్తుతం వారికి తెలిసిన వ్యక్తులు, స్థిరాస్తి వ్యాపారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లుగా తెలుస్తోంది. డాక్యుమెంట్ కొనుగోలుదారుల వివరాలన్నింటినీ డాక్యుమెంట్ వెండర్లు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్‌శాఖ ఆన్‌లైన్ పోర్టల్ నమోదు చేసి విక్రయిస్తున్నారు. ఈ పద్ధతి అమల్లోకి రాకముందు వారి వద్ద నిల్వ ఉన్న డాక్యుమెంట్లపై పాత తేదీ రాసి కొనుగోలు చేసిన వ్యక్తుల వివరాలను మాన్యువల్‌గా రాసి విక్రయిస్తూ ఆన్‌లైన నమోదుకు మంగళంపాడుతున్నారు. ఈ వ్యవహారం కొందరు అక్రమార్కులకు వరంగా మారుతోంది. దీంతో భూ క్రయ, విక్రయాల్లో వివాదాలను సృష్టిస్తున్నారు. సదరు డాక్యుమెంట్ ఆధారంగా ప్రత్యర్థులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. చివరికి రాజీపడుతున్నట్లుగా ముందుకొచ్చి బాధితుల నుంచి వసూళ్లకు తెగబడే స్థాయికి ఆఫ్‌లైన్ డాక్యుమెంట్లను తెరపైకి తెచ్చి వారి పంతం నెగ్గించుకుంటున్నారు.

30శాతం అదనపు వసూళ్లు

డాక్యుమెంట్ వెండర్ల విక్రయాలపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. శాఖాపర నిబంధనల మేరకు జ్యుడీషియరీ స్టాంప్ పేపర్లను నిర్ణీత ధరకు విక్రయించాలి. అయితే కొందరు వెండర్లు కృత్రిమ కొరత సృష్టించి అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇటీవల స్థిరాస్తుల విలువ రెట్టింపైన నేపథ్యంలో ఎక్కువగా రూ.100 స్టాంపుల విక్రయాలకు డిమాండ్ పెరిగింది. వినియోగదారుల నుంచి వస్తున్న డిమాండ్‌ను గమనించి వెండర్లు స్టాక్ లేదంటూ నమ్మించి అసలు ధరపై 40శాతం వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. ప్రతీ నాన్ జ్యుడీషియరీ బాండ్ల విలువపై అదనపు వసూలు చేస్తున్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. మిర్యాలగూడ పట్టణంలో పాత డేట్లతో మాన్యువల్‌గా స్టాంపుల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అదేస్థాయిలో అదనపు వసూళ్లు జరుగుతున్నాయి. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ ఆవరణలో ఉన్న స్టాంప్‌వెండర్ల దోపిడీ మరీ ఎక్కువగా ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇక్కడ స్టాంప్ పేపర్ల విక్రయాలపై 50శాతం వరకు అదనంగా వసూలు చేస్తున్నట్టు పలువురు తెలిపారు. ఈ విషయం తెలిసి కూడా సంబంధితశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

విచారించి చర్యలు తీసుకుంటాం

జ్యుడీషియరీ బాండ్ల విక్రయాల్లో అక్రమాలు జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. డీఆర్ లాగిన్‌లో అప్రువల్ అయితేనే డాక్యుమెంట్ చెల్లుబాటు అవుతుంది. ఏడాదిన్నర కాలంగా ఆన్‌లైన్‌లో విక్రయాలు జరుగుతున్నాయి. మాన్యువల్ విక్రయాలకు ఎలాంటి అవకాశం లేదు. దీనిపై విచారణ చేపట్టి సదరు వెండర్లపై చర్యలు తీసుకుంటాం.

బలరాం (సబ్‌రిజిస్ట్రార్, మిర్యాలగూడ)

● హరోం హర





సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఎస్ఎస్‌పీ క్యాంప్ పాఠశాల ఆవరణలో ప్రతిష్ఠించిన మృత్తిక శివలింగానికి ఆదివారం రాత్రి మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. 2 క్వింటాళ్ల గంధసింధూరం, లక్ష రుద్రాక్షలు, 300కిలోల వివిధ రకాల పూలు, 10కిలోల నెయ్యి, 3క్వింటాళ్ల విబూది, 2క్వింటాళ్ల గంధం, 2క్వింటాళ్ల పసుపు, 2క్వింటాళ్ల కుంకుమ, 200 లీటర్ల పళ్ల రసాలు, 35 రకాల ఆకులు, 100 లీటర్ల పెరుగు, 500 లీటర్ల పాలు, 50 కిలోల డ్రైఫ్రూట్స్‌తో అభిషేకాలు నిర్వహించారు. అంతకముందు పట్టణంలో కోయ నృత్యంతో ఊరేగింపు నిర్వహించారు.



ఉల్లాసంగా.. ఉత్సాహంగా

దేవరకొండలో 30 ఏళ్లుగా వృద్ధాశ్రమం నిర్వహిస్తున్న సంధ్యారెడ్డి

వృద్ధాశ్రమంలో పిల్లలు పట్టించుకోని వాళ్లే ఉంటారని అనుకుంటారు. కానీ ఆ భావన సరికాదు. ప్రస్తుతం ఉరుకులు పరుగుల జీవనయానం, ఉద్యోగాలూ, వ్యాపారాలతో బిజీగా కావడం, భార్యాభర్తల్లో ఒకరు చనిపోతే మరీ ఒంటరిగా అనిపించడం తదితర కారణాలతో చాలామంది వృద్ధులు స్వచ్ఛందంగా ఆశ్రమాలను ఆశ్రయిస్తున్నారు. శేష జీవితాన్ని తమ వయస్సున్న వృద్ధులతో ఆనందంగా గడుపుతున్నారు. ఈ క్రమంలో పిల్లలు సైతం తరచుగా వచ్చి చూసి వారితో గడుపుతున్నారు.

-(దేవరకొండ, ఆంధ్రజ్యోతి)

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామానికి చెందిన మాదిరెడ్డి సంధ్యారెడ్డి, భర్త మల్లారెడ్డితో కలిసి 35 ఏళ్ల క్రితం దేవరకొండకు వచ్చి స్థిరపడ్డారు. మల్లారెడ్డి వృత్తిరీత్యా వైద్యుడు కావడంతో దేవరకొండలో చిన్న పిల్లల వైద్యుడిగా తక్కువ ఫీజుతో వైద్య సేవలు అందించేవాడు. అయితే ఆయన స్ఫూర్తితో సంధ్యారెడ్డి 1994లో మహాలక్ష్మి మహిళా మండలి పేరుతో 8 మందితో వయోవృద్ధుల ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు 15 మంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు. సంధ్యారెడ్డి ఇద్దరు కుమారులు, కోడళ్లు అందరూ వైద్యులే. వారు వృత్తిరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. భర్త కొన్నేళ్ల క్రితమే మృతి చెందారు. ఆమె మాత్రం దేవరకొండలోనే ఉంటూనే సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి కాకుండానే మహబూబ్‌నగర్, గుంటూరు, హైదరాబాద్‌కు చెందిన వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు. దాతలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఆశ్రమానికి సొంత భవనం నిర్మించి అందులోనే వృద్ధులకు భోజనాల సౌకర్యాలు కల్పిస్తూ దాతృత్వం చాటుకుంటున్నారు.

కాలక్షేపానికి లోటు లేకుండా...

ఆశ్రమంలోని వృద్ధులు తమకు తోచిన పని చేస్తారు. ఉదయం లేచిన వారు కొద్ది సేపు వ్యాయామం చేస్తారు. టీవీ చూడడం, పత్రికలు , పుస్తకాలూ చదవడం ఇలా కాలక్షేపానికి లోటుండదు. కేంద్ర ప్రభు త్వం, కొద్దిమంది దాతలు ఇస్తున్న నిధులతో ఆశ్రమాన్ని నడిపిస్తున్నారు. అనారోగ్యంగా ఉన్నప్పుడు వైద్యుడు పరిశీలిస్తాడు. అలాగే వారానికో నర్సు బీపీ, షుగర్ చెక్ చేస్తుంటారు.

అమ్మలా ఆదరిస్తోంది

25 ఏళ్లుగా ఆశ్రమంలో ఉంటున్నా. నిర్వాహకురాలు సంధ్యారెడ్డి అమ్మలా ఆదరిస్తూ సేవలు అందిస్తుంది. నాకు ఇద్దరు కొడుకులు, కోడళ్లు, మనవళ్లు ఉన్నప్పటికీ ఆశ్రమంలోనే ఆనందంగా ఉంటున్నా. అప్పుడప్పుడు పిల్లలు వచ్చి చూసి వెళుతుంటారు.

- రాములమ్మ, మాడ్గుల, మహబూబ్‌నగర్ జిల్లా.

సేవ చేయడంలో ఆనందం



వృద్ధులకు సేవ చేయడంలో ఎంతో తృప్తి ఉంది. కంటికి రెప్పలా వారిని చూసుకుంటున్నా. ప్రజా ప్రతినిధులు, దాతలు, ప్రభుత్వాల సహకారంతో ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడుతున్నా. 70 ఏళ్ల వయస్సులో భర్త స్ఫూర్తితో సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నా.

- మాదిరెడ్డి సంధ్యారెడ్డి, ఆశ్రమ నిర్వాహకురాలు



ఆశ్రమంలో భోజనం చేస్తున్న వృద్ధులు

స్వయం ఉపాధిలో విస్తరిస్తూ..

చదువు అంతగా లేదు.. ఎక్కడా పనిచేసే ఇష్టం లేదు, స్వయం ఉపాధితో నిలబడ్డాలన్న ఆలోచనతో నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లికి చెందిన వరికుప్పల శేఖర్ విస్తరాకుల కంపెనీని ప్రారంభించాడు. ఇంటి వద్ద రూ.2 లక్షలతో ఒక యంత్రంతో వ్యాపారం ప్రారంభించాడు. మొదట అంతగా విక్రయాలు జరిగేవి కావు, తానే ఊరూరా తిరుగుతూ విక్రయాలు చేపట్టాడు. అలా మొదలైన వ్యాపారం నేడు ఇతర రాష్ట్రాలకు విస్తరించింది. కొండమల్లేపల్లిలోనే 20మందికి ఉపాధి కల్పిస్తూ కంపెనీని నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం రూ.కోటి టర్నోవర్‌కు చేరింది. ఉన్నత చదువులేకపోయినా స్వయం ఉపాధితో జీవితంలో నిలదొక్కుకోవచ్చని నిరూపిస్తున్నాడు శేఖర్.

● (కొండమల్లేపల్లి, ఆంధ్రజ్యోతి)



కొండమల్లేపల్లిలో శేఖర్ కంపెనీలోని విస్తరాకులు

నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం పెండ్లిపాకలకు చెందిన వరికుప్పల శేఖర్ ఇంటర్ పూర్తిచేశాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఉన్నత చదువులు చదివే స్థోమతలేక హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో చిరుఉద్యోగిగా చేరి రెండేళ్ల పనిచేశాడు. ఒకరి కింద పనిచేయడం ఇష్టంలేక 2008లో స్వగ్రామానికి వచ్చాడు. సుమారు రూ.2లక్షల వ్యయంతో విస్తరాకుల యంత్రాన్ని కొనుగోలు చేసి ఇంటి వద్దే కుటుంబ సభ్యుల సహాయంతో తయారుచేయడం ప్రారంభించాడు. విస్తరాకులను కొండమల్లేపల్లి, దేవరకొండ, పీఏపల్లి, ఇతర ప్రాంతాల్లో హోల్‌సేల్‌గా విక్రయిస్తుండేవాడు. మొదట్లో అంతంతమాత్రంగానే నడిచినా వ్యాపారం వృద్ధి చెందుతుండటంతో రూ.12లక్షల పెట్టుబడితో మరో యంత్రం కొనుగోలు చేసి కొండమల్లేపల్లికి వచ్చి త్రీస్టార్ పేపర్ ప్లేట్స్, డిస్పోజల్స్ పేరిట కంపెనీని ప్రారంభించాడు. కంపెనీలో 20 మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేర్చాడు. నాణ్యత విషయంలో పెద్దపీట వేస్తూ తక్కువలాభంతో విక్రయాలు నిర్వహిస్తుండటంతో వ్యాపారం పెరిగినట్లు శేఖర్ తెలిపాడు. కంపెనీ నిర్వహణలో కుటుంబ సభ్యుల సహకారం ఉండటంతో వ్యాపారాన్ని మరింత విస్తరించాడు.

ఇతర రాష్ట్రాలకు విస్తరించి..

కొండమల్లేపల్లిలో ప్రారంభమైన త్రీస్టార్ కంపెనీ క్రమంగా ఇతర రాష్ట్రాలకు విస్తరించింది. విశాఖపట్నం, బెంగళూరు, ఢిల్లీలో కంపెనీలను ప్రారంభించారు. బొంబాయితో పాటు కర్ణాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలకు విస్తరాలను పంపిణీ చేస్తున్నారు. విస్తరాకులతో పాటు విస్తరాకులు తయారు చేసే యంత్రాలను తయారు చేయిస్తూ ఇతరులకు విక్రయిస్తుంటాడు.

కంపెనీ సామర్థ్యాన్ని పెంచే ఆలోచనలో ఉన్నా



తక్కువపెట్టుబడితో విస్తరాకుల కంపె నీని ప్రారంభించా. చాలా మందికి ఉపాధి కల్పిస్తున్న. ఎదగాలన్న ఆకాంక్ష ఉండాలి. నచ్చిన ఉపాధిలో ముందుకు వెళ్లాలి. వేరుశనగ నూనె తయారు చేసే కంపెనీని ఏర్పాటుచేసే ఆలోచనలో ఉన్నా. ఆ కంపెనీతో మరో 10మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుంది.

- వరికుప్పల శేఖర్

స్కేటింగ్‌లో బంగారం

● బంగారు పతకం సాధించిన బట్టు శతమన్యు



బంగారు పతకంతో శతమన్యు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్కేటింగ్ క్రీడ అండర్ - 9 విభాగంలో బట్టు శతమన్యు బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. హైదరాబాద్ నగరంలోని జేఎన్‌టీయూ కూకట్‌పల్లి పరిధిలోని బౌరంపేట క్రీడా మైదానంలో జీఆర్ఎస్ అకాడమీ ఇన్నర్ స్కూల్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో మిర్యాలగూడ పట్టణానికి చెంది న డాక్టర్ రమా, వెంకటేశ్వర్లు దంపతులకు చెందిన శతమన్యు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తమ ప్రత్యర్థులను చిత్తుచేశాడు. మూడురోజులుగా జరుగుతున్న స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. స్కేటింగ్ క్రీడపై ఆసక్తి పెంచుకున్న శతమన్యుకు తల్లిదండ్రులు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని పతకాలు గెలుచుకున్నాడు. శతమన్యు మిర్యాలగూడ పట్టణంలోని విశ్వభార్గవి పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచే విధంగా కోచ్ పెద్దులు వద్ద ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. తమ కుమారుడు బంగారు పతకం గెలుచుకోవడంపై ఆనంద ం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఉపాధ్యాయులతో పాటు పట్టణ వైద్యులు, క్రీడాభిమానులు అభినందించారు.

క్రీడలతో మానసికోల్లాసం

● ఏసీపీ కిషన్‌రావు



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఏసీపీ కిషన్‌రావు

భువనగిరి రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శరీర దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని హైదరాబాద్ మూడో జోన్ ఏసీపీ కొత్త కిషన్‌రావు అన్నారు. మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల విద్యాలయాల ఉమ్మడి నల్లగొండ జిల్లా 14 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్థులకు ఆదివారం భువనగిరి మండలం అనంతారం గ్రామంలో క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో పాల్గొని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ ప్రిన్సిపాల్ వీరమల్ల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో పట్టుదల, చురుకుదనంతో పాటు ఐక్యతను పెంచుతాయన్నారు. ముందుగా క్రీడా జ్యోతిని వెలిగించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఝాన్సీరెడ్డి, ఏమిమా, దశరథ, కవిత, రూపారెడ్డి, మురళి, భువన, ఉమ్మడి జిల్లాల విద్యార్థులు ఉన్నారు.

సమాజ రుగ్మతల పరిష్కారానికి బౌద్ధమే శరణ్యం



గ్రంథాన్ని ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగార్జునసాగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సమాజ రుగ్మతలను రూపుమాపడానికి బుద్ధుడి బోధనలే శరణ్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుద్ధవనం కన్సల్టెంట్ ఫ్లీచ్ ఇండియా సీఈవో ఈమని శివనాగిరెడ్డి పాలీ భాష నుంచి తెలుగులోకి అనువదించిన బుద్ధవంశం గ్రంథాన్ని ఆదివారం సికింద్రాబాద్‌లోని మహేంద్ర హిల్స్ లో ఆవిష్కరించారు. మహబోధి బుద్ధ విహార ప్రధాన పోషకుడు బుద్ధవనం ప్రాజెక్టు మెంటర్ చెన్నూరు ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'అన్నారు. అనంతరం శివనాగిరెడ్డిని, వ్యాఖ్యానాన్ని రచించిన తియ్యగూర సీతారామిరెడ్డిని మంత్రి సత్కరించారు. కార్యక్రమంలో బౌద్ధ భిక్షవులు పూజ్య ఇట్టిక, ఆనంద, సుగతానంద, బుద్ధపాల, బుద్ధదత్త, సంఘపాల, బౌద్ధోపాసకులు సంబటూరి వీరనారాయణరెడ్డి, సూదన్‌రెడ్డి, శ్యాంసుందర్ రావు, బీఎ స్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పరందాములు పాల్గొన్నారు.



ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతు చేస్తున్న బాలాజీ నాయక్



మోటార్‌స్టార్టర్ రిపేరు చేస్తున్న బాలాజీ

స్థైర్యంతో నిలబడి...

- ● ఎలక్ట్రీషియన్‌గా రాణిస్తున్న బాలాజీనాయక్
- ● అనారోగ్యంతో చచ్చుబడిన రెండు కాళ్లు
- ● స్వయంఉపాధితో యువతకు స్ఫూర్తి

తుర్కపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాలాజీనాయక్ ఆత్మస్థైర్యం ముందు కాళ్లు చచ్చుబడిన విషయం చిన్నదైంది. విద్యుత్ విభాగంలో ఎలక్ట్రీషియన్‌గా రాణిస్తున్నాడు. బాలాజీనాయక్ స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం జేతురాంతండా పరిధిలోని సంగ్యాతండా. ఓ వైపు పంచాయతీ కారోబార్‌గా పనిచేస్తూనే ఎలక్ట్రీషియన్‌గా స్వయంఉపాధి పొందుతూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. నలుగురు కుమారులున్న ఇంట్లో బాలాజీనాయక్ మొదటివాడు. మూడేళ్ల వయసులో అనారోగ్యంతో రెండు కాళ్లూ చచ్చుబడ్డాయి. ఎనిమిదేళ్ల వరకూ ఇంటి వద్దే ఉన్న అతడిని తల్లిదండ్రులు పాఠశాలలో చేర్పించారు. మండలంలోని వాసాలమర్రి ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ చదువుకున్నాడు. అదే సమయంలోనే చిన్నచిన్న ఎలక్ట్రికల్ పనులు చేసేవాడు. ఫ్యాన్లు మరమ్మతులకు గురైనా, ఏ చిన్న విద్యుత్ సమస్య వచ్చినా సవరించేవాడు. పదో తరగతిలో ఫెయిల్ కావడంతో ఉపాధి కోసం తనకు ఆసక్తి ఉన్న ఎలక్ట్రికల్ పనులపై శ్రద్ధ చూపించాడు.

ఎలాంటి టెక్నికల్ సర్టిఫికెట్, శిక్షణ లేకపోవడంతో తుర్కపల్లి మండల కేంద్రంలోని ఓ ఎలక్ట్రికల్ మెకానిక్ దుకాణంలో ఏడాది పాటు పనిచేశాడు. ఆ తర్వాత తండాలో ఉంటూ ఎలక్ట్రికల్ పనులను వృత్తిగా మలుచుకున్నాడు. ఇంట్లో ఫ్యాన్లు, మిక్సీలు, ఇతరత్రా ఎలక్ట్రికల్ మైక్ సెట్లు, సీడీ ప్లేయర్లులు ఇలా ఏ చిన్న మరమ్మతులకైనా బాలాజీనాయక్ ఆ చుట్టు పక్కల ప్రాంతం వారికి చిరునామా. అంతేకాకుండా వ్యవసాయ మోటార్లు, స్టార్టర్ల మరమ్మతులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఇళ్లలో హౌస్ వైరింగ్, ప్లంబింగ్ పనులు చేస్తుంటాడు. అంతేకాకుండా విద్యుత్ స్తంభాలు ఎక్కి రిపేరు పనులు చేస్తూ అందరికి అందుబాటులో ఉంటున్నాడు. జేతురాంతండా పంచాయతీగా ఏర్పాటైన సందర్భంలో బాలాజీనాయక్‌కు ఉపాధి నిమిత్తం వాటర్‌మన్‌గా, కారోబార్‌గా అవకాశం కల్పించారు. ప్రస్తుతం ఆ విధులు నిర్వహిస్తూనే ఎలక్ట్రీషియన్‌గా చేస్తూ రాణిస్తున్నాడు.

జీరో వడ్డీ వ్యాపారమెలా?

(3వ పేజీ తరువాయి)

పడుతున్న తరుణంలో ఈనెల 1 నుంచే వర్తించేలా పంట రుణాల అందజేతకు సవరించిన వడ్డీ మార్గదర్శకాల ఉత్తర్వులు సంఘ ఆదాయాన్ని తగ్గించేలా ఉన్నాయని పాలకవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

తీసుకున్న అప్పు, ఇచ్చే రుణంపై వడ్డీ 7శాతమే!

టెస్కాబ్ సవరించిన మార్గదర్శకాల మేరకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు కూడా పీఏసీఎస్‌లకు ఇకపై 7శాతం వడ్డీ మేరకే అప్పు ఇవ్వనున్నాయి. గతంలో నాబార్డ్ నుంచి అందిన నిధులతో టెస్కాబ్ ద్వారా జిల్లా కేంద్ర సహకార బ్యాంకులకు 5.25 వడ్డీతో అప్పు ఇచ్చేవి. వీటిని సహకార బ్యాంకులు 5.85శాతం వడ్డీగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు అప్పుగా ఇచ్చేవి. ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు 7శాతం వడ్డీతో రైతులకు స్వల్పకాలిక పంట రుణాలు ఇచ్చేవి. దీంతో రైతులకు ఇచ్చే స్వల్పకాలిక పంట రుణాలపై 1.15శాతం మేర వచ్చే వడ్డీ సొసైటీలకు లాభంగా సమకూరేవి. అయితే నాబార్డుకు బదులు టెస్కాబ్ సొంత నిధులను అందజేస్తుండటంతో సవరించిన మార్గదర్శకాల మేరకు సహకార బ్యాంకులు కూడా పీఏసీఎస్‌లకు 7శాతం వడ్డీతోనే అప్పు ఇవ్వాల్సిందిగా సర్క్యులర్ జారీ చేసింది.

అధిక వడ్డీకి నాబార్డు నిబంధనలు అడ్డు

ఇదిలా ఉంటే నాబార్డు నిబంధనల మేరకు రైతులకు స్వల్పకాలిక రుణాల కింద ఇచ్చే పంట రుణాలపై 7శాతానికి మించి వడ్డీ వసూలు చేయరాదనే నిబంధనలున్నాయి. దీంతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల నుంచి తాజాగా 7శాతం వడ్డీ రేటుతో అప్పు తెచ్చి అంతే వడ్డీ రేటుతో రైతులకు పంట రుణాల కింద ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విధానంతో 1.15శాతం వడ్డీని కోల్పోవడంతో పాటు పైసా లాభార్జన లేని వ్యాపారం ఎలా చేయాలని సొసైటీల నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. సొసైటీ పరంగా ఎఫ్‌డీ చేసిన సొంత నిధులతోనే తప్ప సహకార బ్యాంకుల ద్వారా తెచ్చుకున్న అప్పుతో వ్యాపారం చేయలేని పరిస్థితికి పీఏసీఎస్‌లు చేరనున్నాయి.

మార్గదర్శకాలను పునఃపరిశీలించాలి



వడ్డీ మార్గదర్శకాలను సవరిస్తూ టెస్కాబ్ జారీ చేసిన ఉత్తర్వులను పునఃపరిశీలించాలి. తెచ్చిన అప్పుకు కేంద్ర సహకార బ్యాంకుకు చెల్లించే వడ్డీని 7శాతం పెంచడం సరికాదు. అంతే వడ్డీ కింద రైతులకు స్వల్పకాలిక పంట రుణాలు ఇవ్వాల్సి వస్తే ఆదాయం లేకుండా వ్యాపారం చేస్తున్నట్టే. లాభం రాని, లాభం లేని వ్యాపారాన్ని ఎలా చేయాలో మార్గదర్శకాలు జారీ చేసిన ఉన్నతాధికారులు పునరాలోచించాలి. పీఏసీఎస్‌ల బలోపేతానికి ఈ విధానం సరికాదు. వాటి ఆదాయ మార్గాలను మూసివేసినట్లే అవుతుంది. అదేవిధంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు తొమ్మిదేళ్లుగా పీఏసీఎస్‌లకు బకాయి పడిన డివిడెండ్‌ను కూడా వెంటనే చెల్లించాలి.

● కసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, నార్కట్‌పల్లి

సొసైటీల మనుగడకు ప్రమాదం

స్వల్పకాలిక పంట రుణాల అందజేతలో సవరించిన మార్గదర్శకాలు పీఏసీఎస్‌ల మనుగడకు ప్రమాదకరంగా మారనున్నాయి. ఓ వైపు పీఏసీఎస్‌లను మల్టీపర్పస్ వ్యాపార కేంద్రాలుగా పటిష్ట పరుస్తామని కేంద్రం ప్రకటిస్తుంటే, తాజాగా వచ్చిన మార్గదర్శకాలు సంఘాలు కుదేలయ్యేలా ఉన్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వడ్డీ శాతం పెంచి రుణం ఇచ్చే అవకాశం లేకపోగా, పాత విధానంలో అప్పు తెచ్చుకునే పరిస్థితి కొరవడితే సంఘాల ఉనికికే ప్రమాదం ఏర్పడనుంది. ఇదే కొనసాగితే ఉమ్మడి జిల్లాలో ఉన్న 107 పరపతి సంఘాల్లో కొన్ని ఆదాయార్జన లేక దెబ్బతినే ప్రమాదం ఉంది.

లక్ష మందితో బహిరంగ సభ

(3వ పేజీ తరువాయి)



సమ్మేళనానికి వస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సామేల్, వీరేశం

స్కూల్, మోత్కూరుకు 30 పడకల ఆస్పత్రి, అడ్డగూడూరుకు ఐటీఐ మంజూరు చేయించానన్నారు. మూసీలో ఐదు చెక్‌డ్యాంల నిర్మాణానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు.

అందరూ వారిలా ఉండరు : ఎమ్మెల్యే వీరేశం

అందరూ రాష్ట్రాన్ని దోచుకతిన్న బీఆర్ఎస్ నేతల్లా ఉండరని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కేసీఆర్ హయాంలో మూసీ ప్రక్షాళనకు కేటాయించిన నిధులు ఖర్చు చేయలేదని, ఆ పార్టీ నేతల జేబుల్లోకి వెళ్లాయని ఆరోపించారు. అందరూ వా రిలానే ఉంటారనుకుని మూసీ ప్రక్షాళన డీపీఆర్ రాకముందే, నిధులు కేటాయించకముందే నిధులు తింటున్నారంటూ కేటీఆర్, హరీష్ రావు గగ్గోలుపెట్టడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. మూసీ నీటిలో హానికారకమైన బ్యాక్టీరియా ఉందని, ప్రక్షాళన చేయకుంటే పరివాహక ప్రాంతంలో ప్రజలు జీవించలేరని, పశుపక్ష్యాదులు కూడా బతకవని డబ్ల్యూహెచ్‌వోనే చెబుతున్నదన్నారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలు ఏకమై ప్రక్షాళన కోసం ప్రభుత్వానికి అండగా నిలువాలని పిలుపునిచ్చారు.

మూసీ ప్రక్షాళన చేయాల్సిందే...

మూసీ ప్రక్షాళనకు మద్దతుగా మానాయకుంట బ్రిడ్జి వద్ద నిర్వహించిన బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలివచ్చారు. సభ సుమారు రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైనా, ప్రజలు ఓపికతో ఎండను సైతం లెక్క చేయకుండా వేచి ఉన్నారు. మానాయకుంటలో రోడ్డు పొడవునా భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మానాయకుంట ప్రాథమిక పాఠశాల నుంచి బ్రిడ్జి వరకు ర్యాలీ నిర్వహించారు. మూసీ ప్రక్షాళన చేయాల్సిందేనని, మూసీ ప్రక్షాళన చేయాలి-రైతులను కాపాడాలి, వాడెవ్వడు వీడెవ్వడు.. మూసీ ప్రక్షాళనకు అడ్డెవ్వడు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞానసుందర్, మహిళా నేతలు పద్మ, కాసోజు శంకరమ్మ, మోత్కూరు, తిరుమలగిరి మునిసిపల్ చైర్‌పర్సన్లు గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి, శాగంటి అనసూర్యరాములు, మోత్కూరు, అడ్డగూడూరు సింగిల్ విండో చైర్మన్లు పేలపూడి వెంకటేశ్వర్లు, కొప్పుల నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోలెబోయిన లింగయ్యయాదవ్, సమరంరెడ్డి, వంగాల సత్యనారాయణ, అన్నెపర్తి సుధాకర్, యుగేందర్, ఇటీకాల చిరంజీవి, నూక కిరణ్‌కుమార్, పాదూరి శం కర్‌రెడ్డి, చిరంజీవి, దండ అశోక్‌రెడ్డి, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.



గురజాల - మానాయకుంట వంతెన మీద నిర్వహించిన సమ్మేళనంలో పాల్గొన్న రైతులు

మంగళవారం చనిపోతున్నారని ప్రజల వనవాసం

● సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో ఘటన

సూర్యాపేట టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో ప్రతీ మంగళవారం ఒకరు చనిపోతున్నారని, కీడు సోకిందని భావిస్తూ ఆ వార్డు ప్రజలు ఆదివారం వనవాసం వెళ్లారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 20వార్డు (జమ్మిగడ్డ)లో నెల రోజుల వ్యవధిలో ఆరుగురు వ్యక్తులు వివిధ కారణాలతో మృతి చెందారు. వీరంతా మంగళవారం రోజే చనిపోవడంతో కాలనీవాసులు తెలిసిన పండితుల సలహా తీసుకున్నారు. వార్డుకు కీడు సోకిందని వార్డు ప్రజలంతా ఇంటికి తాళం వేసి ఒక రోజు వన వాసానికి వెళ్లి అక్కడే భోజనాలు చేసి రావాలని చెప్పారు. దీంతో వార్డు ప్రజలు ఆదివారం వన వాసానికి వెళ్లారు. 20వ వార్డు జమ్మిగడ్డలో సుమారు 1000కుటుంబాలు ఉండగా, అందులో 350 కుటుంబాలకు పైగా సభ్యులు ఉదయం 10.30గంటలకు ఇళ్లకు తాళం వేసి సూర్యాపేట శివారులోని దురాజ్‌పల్లి గుట్టకు వన వాసానికి వెళ్లారు. అక్కడే వంటలు చేసుకుని భుజించి సాయంత్రం నాలుగు గంటలకు తిరిగి వచ్చారు. ఈ ఘటనపై వార్డు కౌన్సిలర్ అన్నెపర్తి రాజేష్ మాట్లాడుతూ కొన్ని నెలలుగా మంగళవారం రోజు ఒకరు మృతి చెందుతున్నారని, పదేళ్ల క్రితం నెల రోజుల వ్యవధిలో 15 మందికి పైగా వివిధ వారాల్లో చనిపోయారన్నారు. ఆనాడు వన వాసానికి వెళితే మరణాలు ఆగాయని, ప్రజల విశ్వాసాలకు అనుగుణంగా కలిసికట్టుగా ఇప్పుడు కూడా వన వాసానికి వెళ్లామన్నారు. వార్డు ప్రజలు వన వాసానికి వెళ్లడంతో ఆదివారం వార్డులోని పలు వీధులు నిర్మానుష్యంగా మారాయి.



నిర్మానుష్యంగా మారిన సూర్యాపేటలోని జమ్మిగడ్డలోని ఓ వీధి

ధరలను నియంత్రించాలి

కూరగాయల ధరలు రోజురోజుకు ఆకాశాన్ని అంటుతున్నాయి. గతంలో రూ.30 నుంచి 40 వరకు ఉన్న కిలో ఉన్న కూరగాయలు ప్రస్తుతం రూ. 70 నుంచి 80 వరకు చేరాయి. మార్కెట్‌కు రూ. 500 తీసుకొని వెళ్లినా సంచినిండా కూరగాయలు రావడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే నిత్యావసర సరుకుల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. వంట నూనెలు మరింత వేడెక్కుతున్నాయి. పెరుగుతున్న ధరలను నియంత్రించి సామాన్యుల కష్టాలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

- చౌటుప్పల్, ఆంధ్రజ్యోతి

ఎంత ఖర్చు చేసినా సంచి నిండడం లేదు



కూరగాయల ధరలు రోజురోజుకు మండి పోతున్నాయి. గతంలో 500 తీసుకెళ్తే కవర్ నిండా కూరగాయలు వచ్చేది. ఇప్పుడు రూ.వెయ్యి తీసుకెళ్లిన సంచినిండా కూరగాయలు రావడం లేదు. ఏ కూరగాయలు కొనాలన్నా ధరలు మండిపోతున్నాయి. కూరగాయలకే నెలకు రూ.3వేల వరకు ఖర్చు అవుతున్నాయి. ప్రభుత్వం పట్టించుకోవాలి. లేకపోతే మాలాంటి సామాన్యులు ఇబ్బంది పడాల్సి వస్తుంది.

- బడేటి మమత,తంగడపల్లి

కూరగాయలు కొనాలంటే భయమేస్తోంది



కూరగాయలు కొనాలంటేనే భయమేస్తోంది. గతంలో రూ.30-40 కిలో ఉన్న కూరగాయలు ఇప్పుడు రూ.60నుంచి70కు చేరాయి. చిక్కుడు కాయ లాంటి ధరలు సుమారు రూ.100 వరకు చేరాయి. బెండకాయ, టమాట, దోసకాయల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. ఏం కొనాలన్నా ఆలోచించాల్సి వస్తోంది. కూరగాయల ధరలు చికెన్‌తో పోటీ పడుతున్నాయి. ప్రభుత్వం ధరలు తగ్గించాలి.

- కాటేపల్లి భాగ్యమ్మ, సంస్థాన్ నారాయణపురం

ధరలు భగ్గుమంటున్నాయి



ఒకవైపు కూరగాయల ధరలు మరోవైపు నిత్యా వసర సరుకుల ధరలు భగ్గుమంటున్నాయి. ఏంకొనాలన్నా కొనే పరిస్థితి లేదు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నూనె ధరలు ఇటీవల బాగా పెరిగాయి. పప్పులు, ఇతర వస్తువుల ధరలు కూడా రోజురోజుకు పెరుగుతున్నాయి. ధరలతో సామాన్యులకు కష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని ధరలు తగ్గించాలి.

-ఆర్. నరసింహ, చౌటుప్పల్

పల్లె వెలుగులేవీ?

(3వ పేజీ తరువాయి)

చేయడం లేదు. మహిళలు ఉచితంగా ప్రయాణించడం వల్ల ఆ డబ్బును ప్రభుత్వం ఆర్టీసీకి రీయింబర్స్‌మెంట్ చేయాలి. అయితే ఇప్పటికే కోట్ల రూపాయల మేర ప్రభుత్వం బకాయి ఉంది. ఎప్పటికప్పుడు రీయింబర్స్ మెంట్ చేయకపోవడంతో పాటు కొత్త బస్సులు కేటాయించకపోవడంతో పాత బస్సులే నడుపుతున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం కారణంగా ఈ బస్సులు కిక్కిరిసి నడుస్తున్నాయి. ఒక బస్సులో 50 నుంచి 60మంది ప్రయాణించాల్సి ఉండగా, 100 మంది వరకు వెళ్తున్నారు. దీంతో అధిక లోడ్ పడి బస్సులు వేగంగా వెళ్లలేక డీజిల్ మైలేజీ రావడం లేదు. దీంతో పాటు కండక్టర్లు, డ్రైవర్లపై ఒత్తిడి కూడా పెరిగింది. కిక్కిరిస్తున్న బస్సులను సకాలంలో డిపోకు చేర్చకుంటే డ్రైవర్లు, కండక్టర్లకు సమస్యగా మారుతోంది. కొత్త నియామకాలు చేపట్టని ప్రభుత్వం ఇటీవల కేవలం కారుణ్య నియామకాలు చేసింది. సుమారు 70మంది వరకు కారుణ్య నియామకాల కింద కండక్టర్, డ్రైవర్‌తో పాటు ఇతర పోస్టుల్లో నియామకం చేపట్టింది. ఏడు డిపోల పరిధిలో ఉద్యోగ విరమణ పొందిన వారి స్థానంలో కొత్త నియామకాలు చేపట్టడం లేదు. సుమారు 100మంది డ్రైవర్లతో పాటు 50మంది కండక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా డిపోలో పనిచేసే సిబ్బంది కొరత కూడా తీవ్రంగా ఉంది. దీంతో ఆర్టీసీని ముందుకు నడిపించడం అధికారులకు కష్టతరంగా మారింది.

70 రూట్లలో నడవని పల్లె వెలుగు బస్సులు

రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో సుమారు 70రూట్లల్లో పల్లె వెలుగు బస్సులు నడపక పోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. సకాలంలో బస్సులు లేక మహిళలు సైతం ఆటోలను ఆశ్రయిస్తున్నారు. చిన్న పంచాయతీలకు, మారుమూల ప్రాంతాలకు బస్సులు నడవడం లేదు. కొన్ని రూట్లల్లో వారానికి రెండు రోజులు నడిపి, మళ్లీ సర్వీసులను బంద్ చేస్తున్నారు. కొన్ని మారుమూల గ్రామాలకు రోడ్డు సౌక ర్యం లేక బస్సులు నడపడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలైన మహిళలు ఆధార్‌కార్డు సహాయంతో ఉచింతగా ప్రయాణించాలనుకున్నా బస్సులు ఉండటం లేదు. మండల కేంద్రానికి, జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే బస్సులు రావడం లేదని వాపోతున్నారు. కొన్ని గ్రామాల నుంచి మండల కేంద్రానికి ఆటోల్లో వెళ్లి అక్కడి నుంచి బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. పలు గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా ఏం చేయలేని పరిస్థితి ఉంది. కొన్ని రూట్లల్లో ఆటోలు, ప్రైవేట్ వాహనాలు అధికంగా తిరుగుతుండటంతో సంస కు నష్టం వస్తుందన్న ఆలోచనతో కూడా బస్సులు నడపడంలేదు. అయితే ఆర్టీసీ అధికారులు మాత్రం కేవలం 35 రూట్లల్లో బస్సులు నడపాల్సి ఉందని చెబుతుండటం గమనార్హం.



డిసెంబరులో రీజియన్‌కు 85 ఎలక్ట్రికల్ బస్సులు?

రాష్ట్ర ప్రభుత్వం నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు డిసెంబరు మాసంలో 85 ఎలక్ట్రికల్ బస్సులు కేటాయించనున్నట్లు సమాచారం. నల్లగొండ జిల్లాకు 45 ఎలక్ట్రికల్ బస్సులు రానుండగా, సూర్యాపేట జిల్లాకు 40 ఎలక్ట్రికల్ బస్సులు మంజూరు కానున్నట్లు తెలిసింది. అయితే ఇందులో మొత్తం డీలక్స్ బస్సులు ఉంటాయా? లేకా మహిళా ప్రయాణికులకు ఉచిత ప్రయాణం కోసం ఎక్స్‌ప్రెస్‌కు కేటాయిస్తారా అనేది తేలాల్సి ఉంది. కాలుష్య నివారణతో పాటు డీజిల్ వాహనాలు తగ్గించడం కోసం ఆర్టీసీ కొత్తగా ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేస్తోంది. అయితే ఈ బస్సులు ప్రధాన డిపోల నుంచి కేవలం హైదరాబాద్ రూట్లల్లో మాత్రమే నడిపేందుకు నిర్ణయించినట్లు సమాచారం. ఈ కొత్త ఎలక్ట్రికల్ బస్సులు రావడం వల్ల డ్రైవర్ల కొరత కొంత మేరకు తీరి రవాణా సౌకర్యం మెరుగుపడే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.150	220	250
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.135	198	230

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	589.70
టీఎంసీలు	311.1486
ఎడమకాల్వకు నీటి విడుదల	6,173
కుడికాల్వకు	9,967
విద్యుత్ కేంద్రం ద్వారా	29,394
క్రస్ట్ గేట్ల ద్వారా	96,324
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	64,472 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	67,403 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	2

- నాగార్జునసాగర్, (ఆంధ్రజ్యోతి)

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	43.49 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	5,312 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	28,222 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	2

- మేళ్లచెర్వు, (ఆంధ్రజ్యోతి)

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.80 అడుగులు
టీఎంసీలు	4.15
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	702. 69 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	702.69 క్యూసెక్కులు

- కేతేపల్లి (ఆంధ్రజ్యోతి)

శాలిగౌరారం

పూర్తి స్థాయి నీటిమట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	20 అడుగులు

- శాలిగౌరారం (ఆంధ్రజ్యోతి)

డిండి

పూర్తి స్థాయి నీటిమట్టం	36 అడుగులు
టీఎంసీలు	2.4
ప్రస్తుత నీటిమట్టం	36 అడుగులు
ఇన్‌ఫ్లో	3200 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	3200 క్యూసెక్కులు

- డిండి (ఆంధ్రజ్యోతి)

వేర్వేరు చోట్ల ప్రమాదాలు : 9 మందికి గాయాలు

మర్రిగూడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పది మందికి గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా మర్రిగూడలో కుక్కను తప్పించబోయి టిప్పర్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా మర్రిగూడ చౌరస్తాలో శనివారం రాత్రి జరిగింది. ప్రత్యక్ష స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా మండలంలోని చర్లగూడ రిజర్వాయర్ పనికోసం టిప్పర్‌తో మట్టిని చేరవేస్తున్నారు. ఈ క్రమంలో మర్రిగూడ చౌరస్తాకు రాగానే కుక్క అడ్డురావడంతో దానిని తప్పించబోయి అదుపు తప్పి 33/11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో వాహనం నడుపుతున్న డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రోడ్డు పక్కన ఉన్న చెప్పుల డబ్బాకొట్టు, పండ్ల కొట్టు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకొని గాయపడిన డ్రైవర్‌ను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, మర్రిగూడ చౌరస్తాలో ఉన్న రాజుపేట తండా, పద్మశాలి కాలనీ, వట్టిపల్లి కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయాన్నే విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు సైతం మరమ్మతు చేసి విద్యుత్ సరఫరా చేశారు.



మర్రిగూడలో బోల్తా పడిన టిప్పర్ వాహనం

భువనగిరిలో కెమికల్ ట్యాంకర్

భువనగిరి టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): భువనగిరి జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు పైకి వెళ్లే క్రమంలో కెమికల్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా కొట్టింది. నల్లగొండ వైపునుంచి వచ్చిన ట్యాంకర్ కర్ణాటక వైపు వెళ్తున్నది. ప్రమాద సమయంలో ఎవరూ లేక పోవడంతో పెను ముప్పు తప్పింది. డ్రైవర్ క్షేమంగా బయట పడగా క్లీనర్ స్వల్పంగా గాయాలు కావడతో జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ట్యాంకర్ పల్టీ కొట్టిన వెంటనే ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు.

వ్యాపారులపైకి దూసుకెళ్లిన వాహనం

నేరేడుచర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నేరేడుచర్ల ప్రధాన కూడలిలో బోలేరా అదుపుతప్పి ఆదివారం రాత్రి బోలేరా దూసుకెళ్లింది. మిర్యాలగూడ నుంచి పోనుగోడువైపు వెళ్తున్న బొలేరా బైక్‌లపై దూసుకెళ్లి పక్కనే ఉన్న వీధి వ్యాపారులను ఢీకొట్టింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బోలేరా వాహనం నడుపుతున్న డ్రైవర్ ఒక్కసారిగా రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడంతో బొలేరా వాహనం అదుపుతప్పి వీధి వ్యాపారులపైకి దూసుకెళ్లింది. పండ్ల వ్యాపారులపైకి దూసుకెళ్లడంతో పలువురికి గాయాలు కాగా పండ్ల బుట్టలు చిందరవందరంగా పడ్డాయి. రెండు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. ఒక వాహనం పూర్తిగా బొలేరా కిందకు పోయి ఇరుక్కు పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లేదంటే పక్కనే ఉన్న ఇడ్లీ బండ్ల వ్యాపారుల మీదకు కూడా వాహనం దూసుకెళ్లేది. ప్రమాదం జగరగగానే స్థానికులు 108కి సమాచారం అందించారు. క్షతగాత్రులను 108లో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. నేరేడుచర్లకు చెందిన ముత్యాల వెంకటాచారి (55), నేరేడుచర్లకు చెందిన ఎన్ఎస్‌పీ రిటైర్డ్ ఉద్యోగి మల్లయ్య(75), నేరేడుచర్లకు చెందిన హసానాబాద్ మల్లిఖార్జున్‌చారి(26), హుజూర్‌నగర్ మండలం వేపలసింగారానికి చెందిన భార్యాభర్తలు హుస్సేన్(40), సబియా(34), మిర్యాలగూడ శాంతినగర్‌కు చెందిన బాణావత్ కోమిటి (30)లకు తీవ్ర గాయాలు కాగా వీరిని మిర్యాలగూ ఏరియా ఆసుపత్రికి తరలించారు. రమణ అనే యువకుడు ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసం కాగా, స్వల్పగాయాలతో బయట పడ్డాడు. రమణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ రవీందర్‌తో పాటు పోలీసులంతా హుజూర్‌నగర్ మహారుద్రాభిషేకానికి బందోబస్తుకు వెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కానిస్టేబుళ్లను నేరేడుచర్లకు పంపించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అర్వపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వరికోత మిషన్ డ్రైవర్ మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రానికి చెందిన డెన్సిడ్ దీపక్ జాజిరెడ్డిగూడెం మండలం కొత్తగూడెం గ్రామ ంలో ఓ పొలంలో వరి కోయడానికి వెళ్లాడు. పొలం వద్ద ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు వరికోత మిషన్‌కు తగల డం తో విద్యుదాఘాతంతో దీపక్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ. బాలకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నూతన్‌కల్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం తాళ్లసింగారం గ్రామంలో పోలీసులు పట్టుకున్నారు. ఆ గ్రామానికి రెండు ట్రాక్టర్లలో పాలేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాత కక్షలతో కాంగ్రెస్ నేతపై దాడి

పాలకవీడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై కత్తులతో దాడి చేయడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా గ్రామంలో ఆది వారం సాయంత్రం జరిగింది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలకేంద్రానికి చెందిన వెచ్చా సందీప్ నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి మండలాల బ్లాక్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు. జీవనోపాధి నిమిత్తం రెండేళ్ల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి జాన్‌పహాడ్ దర్గా సమీపంలో కిరాణ దుకాణం నిర్వహిస్తూ జీవనం గడుపుతున్నాడు. అయితే ఇటీవల జరిగిన గణేశ్ నవరాత్రోత్సవాల సమయంలో పాలకవీడుకు చెందిన జహంగీర్‌తో చిన్న ఘర్షణ జరిగింది. దానిని దృష్టిలో పెట్టుకొని జహంగీర్ మరో ఇద్దరు వ్యక్తులతో ఇంట్లోకి ప్రవేశించి కత్తులతో దాడి చేయడంతో మెడ, ముఖం, చేతులకు గాయాలయ్యాయి. దీంతో సందీప్ గట్టిగా అరవడంతో ముగ్గురు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు.

స్థానికులు మిర్యాలగూడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ లక్ష్మీనర్సయ్యను వివరణ కోరగా బాధితులు నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని అన్నారు. దాడి ఘటన సోషల్ మీడియా ద్వారా తెలిసింది. విచారణ చేపడుతున్నామని బాధ్యులను శిక్షిస్తామని తెలిపారు.

దొంగతనాన్ని ఛేదించిన పోలీసులు

- పదితులాల బంగారు అభరణాలు, 174 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం

భువనగిరి రూరల్ అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): భువనగిరి మండలం నందనం గ్రామంలో ఈ నెల 23వ తేదీన ఓ ఇంట్లో జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆదివారం భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ తెలిపారు. హైద్రాబాద్ ఐడీఏ బొల్లారం కు చెందిన సంపంగి రాజు పదో తరగతి మానేసి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతనిపై పలు పాత కేసులు ఉండడంతో పాటు మద్యానికి బానిసై దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో భువనగిరి మండలం నందనం గ్రామానికి చెందిన కొండాపురం బాల్‌రాజ్ ఇంట్లో ఈ నెల 23వ తేదీన తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి 10 తులాల బంగారు, 174 తులాల వెండి అభరణాలను దొంగలించాడు.

బాధితుడు బాలరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు ఆధ్వర్యంలో క్రైం బృందం పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడు సంపంగి రాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకొని రిమాండ్ చేసినట్లు భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ తెలిపారు.

పెళ్లయిన ఆరు నెలలకే మృత్యుఒడికి..

- రెండు నెలల క్రితమే అక్క ఆత్మహత్య
- కుమార్తె మృతిపై అనుమానం ఉందని తండ్రి ఫిర్యాదు
- నిడమనూరు మండలంలో ఘటన

నిడమనూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆ యువతికి ఆరు నెలల క్రితమే మేనబావతో వివాహమైంది. భార్యాభర్తల మధ్య ఎలాంటి గొడవలు లేవు. ఇద్దరు అన్యోన్యంగానే ఉంటున్నారు. ఇంతలోనే ఏమైందో ఏమో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందింది. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం వడ్డెరిగూడెంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామానికి చెందిన గోగుల వెంకన్నకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె శృతిని వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన ఓ యువకుడికి ఇచ్చి వివాహం చేసినా భర్త తీసుకెళ్లకపోవడంతో ఆమె పుట్టింట్లోనే ఉంటుంది. చిన్న కుమార్తె హేమాక్షిని (19) నిడమనూరు మండలం వడ్డెరిగూడెం గ్రామానికి చెందిన తన మేనల్లుడైన కుంచం మహేష్‌కు ఇచ్చి ఈ ఏడాది ఏప్రిల్‌లో వివాహం జరిపించారు. మహేష్ తనకున్న కొద్దిపాటి వ్యవసాయంతో పాటు సుతారి పనులు కూడా చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శనివారం మహేష్, తల్లి లక్ష్మమ్మ, తమ్ముడు శేఖర్ ముగ్గురు కలిసి త్రిపురారం మండలం అన్నారావు క్యాంపు గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటి వద్ద హేమాక్షి ఒంటరిగా ఉంది. వారు సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా గేటు వేసి ఉంది. ఎంతసేపు పిలిచినా హేమాక్షి పలకక పోవడంతో అనుమానం వచ్చిన మహేష్ గోడ దూకి ఇంట్లోకి వెళ్లాడు. కిటికీలోంచి చూడగా గదిలో హేమాక్షి చీరతో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. కిందికి దించి చూడగా ఆమె అప్పటికే మృతి చెందింది. హేమాక్షి ఫ్యాన్‌కు ఉరేసుకున్న విషయాన్ని మహేష్ తన మామ గోగుల వెంకన్నకు ఫోన్‌లో సమాచారం అందించాడు.



హేమాక్షి(ఫైల్ ఫొటో)

రెండు నెలల క్రితమే సోదరి ఆత్మహత్య

పుట్టింట్లో ఉన్న సోదరి శృతి కూడా మనస్తాపానికి గురై రెండు నెలల క్రితం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి హేమాక్షి ముభావంగా ఉంటోందని సమాచారం. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా మృతురాలి తండ్రి గోగుల వెంకన్న తన కుమార్తె మృతిపై అనుమానం ఉందని శనివారం ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

వలిగొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి కింద పడి ఆదివారం గీత కార్మికుడికి గాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పహిల్వాన్‌పురం గ్రామానికి చెందిన మహేష్ రోజు మాదిరిగానే వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 సిబ్బంది రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

మాచారంలో రైతు ఆత్మహత్య

పెన్‌పహాడ్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చెట్టుకు ఉరేసుకొని ఓ రైతు ఆత్మహత్య చేసు కున్నాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం మాచరంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏగ్గడి శ్రీనివాస్(45) సోదరుడు రాంబాబు పత్తి చేనులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన భూక్యా నర్సింహా చూసి శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. దాంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాగా శ్రీనివాస్ భార్య జానకమ్మ మృతికి కారణం మాచరం గ్రామానికి చెందిన బొల్లక రామయ్య, బొల్లక సైదులు, బొల్లక కొమ్ము లయ్య, బొల్లక బక్కయ్య, బొల్లక జానయ్య అతని భార్య సైదమ్మని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్.ఐ యాదగిరి తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



శ్రీనివాస్(ఫైల్)

పోలీసుల న్యాయమైన కోర్కెలు తీర్చాలి

- మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు

నల్లగొండ టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బెటాలియన్ పోలీసుల న్యాయమైన కోరికలు తీ ర్చాలని, వాళ్లను వేధించవద్దని మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు అన్నారు. ప ట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బెటాలియన్ పోలీస్ కుటుంబాల న్యాయమైన కోరికలను పోలీస్ ఉన్నతాధికారులు ప్రభుత్వంతో చర్చించాలన్నారు. ఆందోళన చేస్తున్న పోలీసులను ఉద్యోగాల నుంచి తొలగించవద్దన్నారు. పోలీసులు వాళ్ల హక్కుల కోసం పోరాడే పరిస్థితి లేనందున ఆ కుటుంబసభ్యులు చేస్తున్న పోరాటానికి పౌరసమాజం మద్దతు తెలపాలన్నారు.

యాదగిరికొండపై భక్తుల రద్దీ

- నిత్య ఆదాయం రూ.30,07,901

భువనగిరి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో యాదగిరికొండపై రద్దీ నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్ట దైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. సుమారు 40వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనాలకు గంట, ధర్మదర్శనాలకు రెండు గంటల సమయం పట్టింది. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల వద్ద రద్దీ కనిపి చింది. ఆలయ ఉత్తర దిశలో భక్తులు ఫొటోలు దిగడానికి పోటీ పడ్డారు. భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.30,07, 901ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

లక్ష్మీనృసింహులకు శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొల్పిన అర్చకస్వాములు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండ పంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్ట స్వామి అమ్మవారలకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో నిర్వహించారు.



ఎండలో సంగీత సభలను వీక్షిస్తున్న భక్తులు



క్యూలైన్లలో కిటకిటలాడుతున్న భక్తులు

ఎండలో సంగీత సభలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో తూర్పు రాజగోపురం ఎదురుగా సంగీత సభల నిర్వాహణకు వేదిక నిర్మించారు. ఈ వేదికల ద్వారా తమ కళారూపాలు కళాకారులు ప్రదర్శిస్తారు. ఇందులో భాగంగా ఆదివారం కొండపైన కాశీనాథ్ (భాగవత్తార్) శ్రీనివాసం కల్యాణం హరికథ ఉదయం సుమారు 10గంటల తర్వాత ప్రారంభించారు. అప్పటికే ఎండ ముదిరిపోవడంతో బండలపై నిలుచునేందుకు కాళ్లు వేడెక్కాయి. ఈ స్థితిలో సంగీత సభల్లో జరుగుతున్న హరికథ కాలక్షేపానికి సభికులకు ఎండలో కుర్చీల్లో కూర్చున్నారు. ఎండలకు తాళలేక కొంతమంది భక్తులు హరికథను వీక్షించకుండానే వెళ్లిపోయారు.

అస్తవ్యస్తంగా రహదారులు


డిండి : గుంతలమయంగా మారిన నగరదుబ్బతండా తవక్లాపూర్ రహదారి

డిండి: డిండి మండలంలోని నగరదుబ్బతండా నుంచి తవక్లాపూర్ వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. రెండు కిలోమీటర్ల మేర మోకాళ్లలోతుకు పైగా గుంతలు ఏర్పడి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాల పడినప్పుడు గుంతలు నీటితో నిండిపోయి ప్రయాణికులు నీటిలో పడిపోతున్నారు. ఈ రహదారి గుండా చెర్కుపల్లి, తవక్లాపూర్, కిందిశేషాయికుంట, మీదిశేషాయికుంట, సింగరాజుపల్లి, నగరదుబ్బతండా, హజ్జతండా, జాల్‌తండా గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. మారుమూల తండాల నుంచి హైదరాబాద్ జాతీయ రహదారికి చేరుకోవాలంటే ఈ రహదారి నుంచే వెళ్లాలి. రెండు కిలోమీటర్లమేర గుంతలు ఏర్పడిన మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వేములపల్లి: మండలంలోని ప్రధాన రహదారి అయిన బీమారం - సూర్యాపేట రహదారికి ఇరువైపులా కంపచెట్లు కమ్మివేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిర్యాలగూడ- సూర్యాపేట పట్టణాలను కలిపే ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుపై ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఒకేవైపు వస్తుండటంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

నార్కట్‌పల్లి: వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్లను బావుల వద్దకు తీసుకెళ్లే సమయంలో దమ్ము(ఇనుప) చక్రాలను తగిలించుకుని వెళ్తుండటంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. రోడ్లపై దమ్ము చక్రాల కోతల ఫలితంగా ద్విచక్రవాహనాలు అదుపుతప్పుతూ ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

ఆగని గుప్త నిధుల తవ్వకాలు


గానుగుగట్టు సీతారామచంద్రస్వామి దేవాలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు (ఫైల్)

దేవరకొండ డివిజన్‌లో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. దేవరకొండ ఖిల్లాలోని చారిత్రక కట్టడాలు, ప్రధాన తోరణాలు అపహరించారు. దుండగులు గుప్త నిధుల కోసం చారిత్రక కట్టడాలు, శిల్పాలను ధ్వంసం చేస్తున్నారు. 2004లో దేవరకొండ ఖిల్లాలో నందీశ్వరుని విగ్రహం మాయమైంది. డిండి మండలం వీరబోయినపల్లి వద్ద నందీశ్వరుని విగ్రహాన్ని పగలగొట్టి ఉండటాన్ని పోలీసులు అప్పట్లో గుర్తించారు. గుప్త నిధుల కోసమే నందీశ్వరుని విగ్రహాన్ని అపహరించి ధ్వంసం చేశారు. 2012లో దేవరకొండ ఖిల్లాలోని ప్రధాన ముఖ తోరణాన్ని బ్లాస్టింగ్‌లతో పేల్చి వేసి ధ్వంసం చేశారు. ఖిల్లాలో శివాలయం, కోనేరు ప్రాంతాలలో తవ్వకాలు నిర్వహించిన సంఘటనలు అనేకం ఉన్నాయి. దేవరకొండ ఖిల్లాతో పాటు గాజీనగర్ రోడ్డులోని గానుగుఘట్టు సీతారామచంద్రస్వామి దేవాలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు నిర్వహించారు. దేవరకొండ, చందంపేట, కొండమల్లేపల్లి, డిండి మండలాల్లో గుప్త నిధుల ముఠా సంచరిస్తూ కొన్నేళ్లుగా అక్రమ తవ్వకాలు జరుపుతూనే ఉన్నాయి. ఇటీవల కొండమల్లేపల్లి మండలం మర్రిచెట్టుతండా గ్రామపంచాయతీ జేత్యతండాలో గుప్త నిధుల కోసం వీరన్న, మల్లన్న, ఆంజనేయస్వామి దేవాలయాల చుట్టూ తవ్వడంతో పాటు విగ్రహాలను ధ్వంసం చేశారు. పోలీసులు స్పందించి గుప్త నిధుల కోసం తవ్వుతున్న ముఠాపై నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై డీఎస్పీ గిరిబాబునును వివరణ కోరగా గుప్త నిధుల కోసం తవ్వకాలు నిర్వహిస్తే విచారణ చేసి కఠినచర్యలు తీసుకుంటాం. తవ్వకాలపై నిఘా ఏర్పాటు చేస్తాం.

దేవరకొండ

'గిరి వికాసం' జరిగేనా..?


ఘాశీరాంతండాలో వేసిన బోరు

గిరిజన రైతుల భూములను సాగులోకి తెచ్చేందుకు మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అమలవుతున్న గిరివికాస పథకం పనులు నత్తనడన సాగుతున్నాయి. ఆర్థిక స్థోమత లేక సొంతంగా బోరు, మోటారు, విద్యుత్ సౌకర్యం కల్పించుకోలేక మెట్ట పంటలనే నమ్ముకుని ఎదుగుబొదుగు లేని జీవితాలు గడుపుతున్న గిరిజనులను గుర్తించి వారి భూములను సాగులోకి తేవడమే గిరివికాసం పథకం ఉద్దేశ్యం. కరెంటు సౌకర్యం కల్పనకు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు అవసరమైన ఎస్టిమేషన్ వేయాల్సి ఉంది. అదేవిధంగా ఉపాధిహామీ పథకం కింద ఈ భూముల్లో రాళ్ల తొలగింపు, వాలుకు అడ్డుకట్టలు వేయడం, పాంపాండ్‌ల నిర్మాణం లాంటి పనులన్నీ చేపట్టి నేలను పంటల సాగుకు అనుకూలంగా చదును చేయాల్సి ఉంది.

ఈ పథకం కింద 2022 జూన్‌లో దరఖాస్తులు స్వీకరించి మార్చిలో లబ్ధిదారుల ఎంపిక నిర్వహించి బోర్లు వేశారు. ఈ బోర్లు వేసి నాలుగు నెలలు గడిచినా మోటార్ల ఊసే లేదు. కరెంటు, భూమి అభివృద్ధి పనులు అడుగు కూడా ముందుకు సాగడం లేదు. తేనపల్లి తండా, ఘాశీరాంతండా గ్రామాల్లో జలవనరుల శాఖ సర్వే ఆధారంగా గుర్తించిన 16మంది లబ్ధిదారుల భూముల్లో బోర్లు వేయగా ఏడు బోర్లలో నీరు వచ్చింది. మరో ఐదు బోర్లలో కొద్దిగా నీరు వచ్చింది. వీటన్నింటికీ మోటార్లు ఏర్పాటు చేస్తే ఆరుతడి పంటలు సాగు చేసుకుంటామని రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఎంపీడీవో మంజులను వివరణ కోరగా మోటార్లకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. కరెంటు, ఇతర పనులు కూడా పూర్తి చేసి భూములను సాగులోకి తెస్తాం. నేల అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు.

గుర్రంపోడు

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్


శిబిరంలో వైద్య పరీక్షలు చేసుకుంటున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వైద్యశిబిరాలను సద్వినియోగం పరుచుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలో హైదరాబాద్ ప్రసిద్ధ ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రసిద్ధ ఆసుపత్రి మేనేజింగ్ ఛైర్మన్ జూకూరు చైతన్య రాజు, పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, మాల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, నాయకులు చాట్ల కిషన్, హరినాయక్, శేఖర్, జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, గోవింద్ గిరి పాల్గొన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

గుర్రంపోడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. గుర్రంపోడు మండలకేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, తగుళ్ల సర్వయ్య యాదవ్, జగదీశ్వర్‌రెడ్డి, గాలి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన సాయిబాబ

నల్లగొండరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దేశంలోని పీడిత, ఆదివాసీ ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ సాయిబాబ అని విరసం సభ్యుడు అరసనవిల్లి కృష్ణ, వీక్షణ పత్రిక సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ అన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ప్రొఫెసర్ సాయిబాబ సంస్మరణ సభలో వారు పాల్గొని మాట్లాడారు. అంగవైకల్యాన్ని కలిగిన సాయిబాబ ఈ దేశంలో పీడిత, ఆదివాసీ ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని అన్నారు. దాదాపు పది సంవత్సరాల కాలం జైల్లో నిర్బంధించి, కనీస వైద్యం అందించకుండా ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించేలా చేశారని వక్తలు పేర్కొన్నారు. సాయిబాబ పోరాట చైతన్యం ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించిందని అన్నారు. ఆయన చూపిన మార్గంలో పీడిత ప్రజల, ఆదివాసీల హక్కుల కోసం పోరాడాలని సూచించారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రజలను నిర్వీర్యం చేసే విద్య అందిస్తున్నారని, చైతన్యం చేసే విద్య కావాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ఫాసిస్ట్ ప్రభుత్వం మేధావులను, ఆలోచనా పరులను అణగదొక్కే తత్వంతో పని చేస్తుందని ఆరోపించారు. ఈ సంస్మరణ సభలో సీహెచ్ సుధాకర్‌రెడ్డి, టీపీఎఫ్, ఎం.సోమయ్య, పన్నాల గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలి


సదర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యాదవసంఘం నాయకులు

నల్లగొండటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని సదర్ ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు మద్ది శ్రీనివాస్‌యాదవ్ కోరారు. జిల్లా కేంద్రంలోని జిల్లా యాదవ సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశం ఆయన మాట్లాడారు. దీపావళి సందర్భంగా ప్రతి సంవత్సరం యాదవులు సదర్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. పాడిపంటలు చక్కగా ఉండాలని గోవులను పూజించి, దున్నపోతులను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి విన్యాసాలు నిర్వహిస్తామన్నారు. పోతురాజుల విన్యాసాలు కూడా ఆకర్షణీయంగా ఉంటాయని అన్నారు. హైదరాబాద్‌కే పరిమితమైన సదర్ పండుగను కొన్నేళ్లుగా జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖులు హాజరవుతున్న ఈ ఉత్సవానికి యాదవులు, ఉద్యోగ, యువజన, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం నాయకులు పిల్లి రామరాజుయాదవ్, ఎల్వీ యాదవ్, అల్లి సుభాష్‌యాదవ్, తరాల పరమేష్‌యాదవ్, గుండెబోయిన జానయ్యయాదవ్, గంగుల చందువంశీ యాదవ్, బెల్లి నాగరాజుయాదవ్, చల్లా కోటేష్‌యాదవ్, కంబాలపల్లి సత్యనారాయణ యాదవ్, సుంకరబోయిన శివకుమార్‌యాదవ్, మర్రి మల్లేష్, గుండెబోయిన సురేష్, అల్లి చంద్రయ్య బక్కతట్ల వెంకన్న, పవన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీని అధికారంలోకి తీసుకురావాలి'

చిట్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీజేపీ అధికారంలోకి తీసుకురావడానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కడియం రామచంద్రయ్య అన్నారు. చిట్యాలలో ఆదివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ పదేళ్ల పాలనలో దేశం ఎన్నో రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీకి అండగా నిలవాలని, సభ్యత్వ నమోదులో నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మాస శ్రీనివాస్, నాయకులు చికిలంమెట్ల అశోక్, గుంటోజు నాగాచారి, దండ శ్రీనివాస్‌రెడ్డి, సామ మహేందర్‌రెడ్డి, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే వేముల వీరేశం


ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కేంద్రంలో కుట్టు శిక్షణ పొందడం ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చన్నారు. ప్రభుత్వం కూడా మహిళలకు పొదుపు సంఘాల ద్వారా రుణసౌకర్యం కల్పిస్తూ వారి జీవనోపాధికి చేయూతనిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు పాశం శ్రీనివాస్‌రెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, సట్టు సత్తయ్య, జెరిపోతుల భరత్, బొంబాయి నర్సింహ, ప్రజ్ఞాపురం సత్తి, ఎస్కే సమద్, సామ కొండల్‌రెడ్డి, బడుగుల ఉపేందర్, మట్టిపల్లి శ్రీను, గడ్డం పశుపతి, ఇడుకుళ్ల సంపత్ కుమార్, అల్డాస్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సువర్చల హనుమత్ కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నకిరేకల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ పట్టణంలోని శ్రీ సత్యసాయి మందిర ఆవరణలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సువర్చల హనుమత్ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో మందిరం అధ్యక్షుడు గర్రె శ్రీనివాస్, సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకట్రావు, పుట్టపర్తి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ రత్నాకర్, పేదపాడుకు చెందిన కరెడ్ల సూర్యనారాయణ, శిష్ట చంద్రశేఖర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ జంధ్యాల గౌరి, నాదశాస్త్రీ, సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు దేవరశెట్టి శ్రీనివాస్, మిట్టపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లోని బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి బాలికల వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం పెరుగుతుందన్నారు. క్రీడా కోటాలో ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని అన్నారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీవో బైరెడ్డి సంధ్య, ప్రిన్సిపాల్ ఉమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ సరిత, పీడీ ఇందిరారెడ్డి, నూకల వేణుగోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, చిలుకూరి బాలు, జిందా, అనూష, నాగలక్ష్మి, సరిత, శాంతి పాల్గొన్నారు.

3న బీసీ గర్జన సభ

వేములపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలో వచ్చే నెల 3న నిర్వహించే బీసీ గర్జన సభలో బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వేములపల్లి మాజీ సర్పంచ్ నాగవెల్లి మధు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ బీసీలు తమ హక్కుల సాధన కోసం ఏకతాటిపై పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ బీసీ గర్జనలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఆర్.కృష్ణయ్య వంటి రాష్ట్ర నాయకులు పాల్గొని బీసీల సమస్యలపై మాట్లాడనున్నట్లు తెలిపారు. బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రోడ్డు నిర్మించాలి

కేతేపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిగూడెం నుంచి తుంగతుర్తి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మించాలని చీకటిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్, సీపీఎం నాయకులు ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని కోరారు. నకిరేకల్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం వారు ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. చీకటిగూడెం నుంచి తుంగతుర్తి వరకు రహదారి నిర్మించడం వల్ల చీకటిగూడెం, తుంగతుర్తి, కేతేపల్లి గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్, సీపీఎం నాయకులు మట్టి సాల్మన్, కోట పుల్లయ్య, జె.వెంకటనర్సయ్యయాదవ్, కోట పూర్ణచందర్‌రావు, బయ్య ముత్తయ్య, కోట లింగయ్య, ప్రవీణ్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి


నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రాన్ని అందజేస్తున్న రమేష్‌యాదవ్

చింతపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బీసీ కులగణ న నిర్వహించిన అనంతరమే ఎన్నికలు నిర్వహించాలని అఖిల యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి రమేష్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన యాదవ సోదరులకు పారదర్శకంగా మంజూరు చేయాలన్నారు. సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించినప్పుడే తగిన ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దాసరి నిరంజన్, ఉపాధ్యక్షులు కృష్ణ, ముడిగ మల్లేష్, నేరటి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా గంగల వెంకటయ్య సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు కదారి అంజయ్య, జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండలు, రాష్ట్ర కార్యదర్శి గోదంగి గోవర్ధన్, సుదనబోయిన సుధాకర్, మహిళా అధ్యక్షురాలు పద్మ, మాల్ మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ నక్క శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ జంగిటి నరసింహ, నాయకులు దాసరి శ్రీనివాస్, గొడ్డటి మధు, వెంకటయ్య, రమేష్ పాల్గొన్నారు.

వడ్డెరుల సమస్యలను పరిష్కరించాలి : అలిమల్లు

దేవరకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వడ్డెరుల సమస్యలను పరిష్కరించాలని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అలిమల్లు డిమాండ్ చేశారు. నేరేడుగొమ్ము మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. వడ్డెరులు కుల వృత్తులను నమ్ముకొని ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డెరులకు రిజర్వేషన్లు కల్పించాలని, వడ్డెర వృత్తిదారులకు లైసెన్స్‌లు అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వడ్డెరులకు అన్ని జిల్లాల్లో సొంత భవనాలు నిర్మించాలన్నారు. వడ్డెరులకు ప్రభుత్వం చేయూతనిచ్చి ఆదుకోవాలన్నారు. వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు బొంత వెంకటయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వడ్డెర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మల్లేష్, నాయకులు ఇరగదిండ్ల కృష్ణ పాల్గొన్నారు.

పోలీసుల సమస్యలను పరిష్కరించాలి

● మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న బెటాలియన్ పోలీసుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బెటాలియన్ పోలీస్ కుటుంబాలు పిల్లలతో సహా రోడ్డెక్కి ఆందోళన చేయడం ఎంతో బాధాకరమన్నారు. ప్రభుత్వం వారి సమస్యలను సానుభూతితో అర్థం చేసుకొని పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం బెటాలియన్ వారి సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అమానుషంగా ప్రవరిస్తుందని ఆయన ఆరోపించారు. తనతో పాటు తమ పార్టీ శ్రేణులు శనివారం బెటాలియన్‌లో ఆందోళన చేస్తున్న వారిని పరామర్శించడానికి వెళ్లినప్పుడు పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. యూనిఫాంతో పోలీసులు ఆందోళన చేసిన దాఖలాలు లేవని ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వల్లే వారు ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. కొంతమంది పోలీస్ ఉన్నతాధికారులు ఆందోళన చేస్తున్న వారిని మాట్లాడటం, పోలీసులే పోలీసుల పట్ల ఈ విధంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. అదేవిధంగా సస్పెండ్ చేసిన పోలీసులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఆందోళన చేస్తున్న పోలీసులకు వారి కుటుంబసభ్యులకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని వారి సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలో భాగస్వాములు అవుతామని తెలిపారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

నల్లగొండరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని స్నేహ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ యాస సరళ అన్నారు. స్నేహ లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ వారి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని రెడ్‌క్రాస్ భవనంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం వల్ల ప్రమాదాల్లో గాయపడిన వారి ప్రాణాలను కాపాడేందుకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిగురి నాగిరెడ్డి, వాణి తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్లపై జీఎస్టీని 5 శాతం తగ్గించాలి

నార్కట్‌పల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కేబుల్ ఆపరేటర్లపై కేంద్రప్రభుత్వం విధించిన 18 శాతం జీఎస్టీని 5శాతానికి తగ్గించాలని కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బడుగుల ఉపేందర్ డిమాండ్ చేశారు. నార్కట్‌పల్లిలో ఆదివారం నిర్వహించిన కేబుల్ ఆపరేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీని 18శాతం విధించడం వల్ల ప్రజలపై ఆర్థిక భారం పడటంతో తమ ఉపాధిపై ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోనే మొట్టమొదటగా ఇంటర్నెట్, కేబుల్ సేవలను ఏకకాలంలో అందించే జీఎస్ ఫైబర్ కేబుల్ నెట్ నార్కట్‌పల్లిలో ప్రారంభించడం హర్షణీయమన్నారు. సమావేశంలో కేబుల్ ఆపరేటర్లు గూడూరు అంజిరెడ్డి, వాసా విద్యాసాగర్, జెల్లా వెంకటేశ్వర్లు, కొప్పు శ్రవణ్, పాటి వెంకట్‌రెడ్డి, నడింపల్లి శ్రీహరి, యాదగిరిరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

నాగార్జునసాగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్.లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. నాగార్జునసాగర్, హిల్, పైలాన్‌కాలనీల్లో ఆదివారం నిర్వహించిన పార్టీ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫెడరల్ విధానానికి వ్యతిరేకంగా వెళ్తున్నాయని విమర్శించారు. సమావేశంలో మండల కార్యదర్శి దుబ్బ రాంచంద్రయ్య, నాయకులు బషీర్, గోవిందు, కృష్ణ, ఆనంద్‌పాల్ పాల్గొన్నారు.

'ధర్మయుద్ధం' సభ విజయవంతం చేయాలి

నకిరేకల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో ఈ నెల 29వ తేదీన నిర్వహించే ఎమ్మార్పీఎస్ ధర్మయుద్ధ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడి శంకర్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేయాలని తీర్పు ఇచ్చినా సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోకుండా నోటిఫికేషన్లు వేసి మాదిగలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ తర్వాతనే నోటిఫికేషన్లు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో వంటిపాక కిరణ్, నిరంజన్, రమాకాంత్, సురేష్, ప్రసాద్, శ్రవణ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

డిండి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): డిండి మండలకేంద్రంలోని మార్కెట్ యార్డుతో పాటు చెర్కుపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే బాలునాయక్, డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ ఛైర్మన్ శ్రీ నివాసరావు ఆదివారం తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు గోదాంను కూడా ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర పొందాలని సూచించారు.

31న దీపావళి పండుగ

రామగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగపై ఎలాంటి అయోమయం చెందకుండా ఈనెల 31వ తేదీన ధనలక్ష్మి పూజ, దీపావళి పండుగ, నవంబరు 1వ తేదీన కేదారేశ్వర వ్రతం, కొత్త నోములు వంటి కార్యక్రమాలు చేసుకోవచ్చని అఖిల బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్‌ఐ వీరశేఖర్ బాధ్యతల స్వీకరణ

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల ఎస్‌ఐగా వీరశేఖర్‌ను నియమిస్తూ ఎస్పీ శరత్‌చంద్రపవార్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన శ్రీనునాయక్ సీఐగా పదోన్నతి లభించింది. దీంతో ఆయన జిల్లా కేంద్రంలో స్పెషల్ బ్రాంచ్ విభాగంలో నియమితులయ్యారు. నల్లగొండలో వీఆర్‌లో ఉన్న వీరశేఖర్‌ను ప్రస్తుతం మండలానికి ఎస్‌ఐగా నియమించడంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

హక్కుల కోసం పోరాడాలి

నకిరేకల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): టీఎన్జీవోస్ ఉద్యోగుల హక్కుల కోసం పోరాడాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి, జిల్లా కార్యదర్శి జె.శేఖర్‌రెడ్డి అన్నారు. నకిరేకల్ పట్టణంలో టీఎన్జీవోస్ నకిరేకల్ యూనిట్ నూతన కార్యవర్గ ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఏ. నరేష్, కార్యదర్శి కె.యాదగిరి, కోశాధికారి సౌజన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశంను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా యూనిట్ సభ్యులు అసోసియేటెడ్ ప్రెసిడెంట్ డీఐ రాజు, నల్లగొండ అర్బన్ యూనిట్ ప్రెసిడెంట్ లక్ష్మయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కర్, వైస్ ప్రెసిడెంట్ దశరథ, టీఎన్జీవోస్ వైస్ ప్రెసిడెంట్ గామయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీను, దుర్గయ్య, అజీమ్, రాజశేఖర్, జానీ, జహంగీర్, ఖాసీం, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

శబరికి పాదయాత్ర

చింతపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని పోలేపల్లిరాంనగర్ గ్రామానికి చెందిన శంకరాచారి రెండోసారి అయ్యప్ప మాల ధరించి హైదరాబాద్ నుంచి ఆదివారం పాదయాత్రతో శబరికి బయలుదేరారు. హైదరాబాద్‌కు చెందిన వేణుగోపాల స్వామి గురువు ఆధ్వర్యంలో పది సంవత్సరాలుగా పాదయాత్ర నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. మాల ధరించడం ద్వారా జీవితంలో ఎదురయ్యే కష్టాలు పూర్తిగా తొలగిపోయి మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు.

'సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి'

డిండి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): డిండి మండలంలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి.మైనుద్దీన్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పత్తి కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయని అన్నారు. ప్రభుత్వం పత్తికి క్వింటాల్‌కు మద్దతు ధర రూ.7521 ప్రకటించినా సీసీఐ కేంద్రాలు లేక రైతులు దళారులకు విక్రయిస్తున్నారని అన్నారు. దీంతో వారు రూ. 5500క్వింటాల్‌కు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తేమ, నాణ్యతలేదని కోతలు విధిస్తూ తూకాల్లో కూడా మోసం చేస్తున్నారని ఆరోపించారు. సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కమిటీలను రద్దు చేయాలి

చందంపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ కమిటీలను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ మండల నాయకులు గోసుల శివశంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీలు కాంగ్రెస్ పార్టీ కమిటీలుగా ఉన్నాయని అన్నారు. వెంటనే వాటిని రద్దు చేసి గ్రామసభ ద్వారా ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో తిరుపతయ్య, శ్రీశైలం, వెంకటేశ్వరరావు, తిరుపతిరావు, సత్తయ్య పాల్గొన్నారు.